

వినియోగదారులకు షాక్

ఆర్బీఐ తీసుకొచ్చిన నిబంధన కారణంగా చాలామంది వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. కొత్తగా విద్యుత్తు శాఖ తీసుకొచ్చిన సాకర్యంపై ప్రజలకు అవగాహన లేదు. -8లో



అనుమానంతోనే.. గొంతుకోసి హత్య

నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లెలో గతనెల 27న జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. అనుమానంతో భర్త హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.500	రూ.600
రెండోరకం	రూ.400	రూ.490

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1457 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	427	480
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 372.220 కిలోలు

జెడ్పీలో సమస్యల ఏకరువు

- ఒక్కొక్కటిగా హామీల అమలు
- కక్ష సాధింపులు ఉండవు
- జెడ్పీ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



వైఎస్సార్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: కడప జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. రైతులు, విద్యార్థుల సమస్యలపై గళమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. అధికారపార్టీ నేతలు, అధికారులు నామ మాత్రపు సమాధానాలతోనే సరిపెట్టారు. రాష్ట్ర ప్రజల కోసం తాము కట్టు బానిసల్లా పనిచేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జెడ్పీ ఇన్‌చార్జి చైర్ పర్సన్ శారద అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజల అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులను తీసుకొస్తామని వెల్లడించారు. కక్ష సాధింపులు ఉండవని, అధికారం ఉందని అహంకారం ప్రదర్శించబోమని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కోవలో ఇప్పటికే పింఛన్ మొత్తాన్ని పెంచామని, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి చర్యలు చేపట్టామన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. రానున్న ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వెయిటింగ్ లిస్టు మేరకు రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లు మంజూరు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మారిందని వంట ఏజెన్సీలు, స్వీపర్లను తొలగించబోమని స్పష్టం చేశారు. తమ పార్టీకి చెందిన నాయకులు ఎక్కడైనా అలా చేస్తుంటే వారికి నచ్చజెబుతామన్నారు. వలంటీర్ల వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయమే తీసుకుంటుందని తెలిపారు.

- రైతులకు యూరియా, డీఏపీ సరఫరా చేయాలని, రైతు భరోసా సాయం తక్షణమే అందించాలని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు తాము ఇచ్చిన హామీ మేరకు రూ. 20 వేల సాయం చేస్తామని మంత్రి బదులిచ్చారు. ఆర్బీకేల ద్వారా ఐదేళ్లలో జరిగిన విత్తనాలు, ఎరువుల సరఫరా సమీక్షిస్తున్నామన్నారు.
- చీనీ, మామిడి, పంటలకు ప్యాక్‌హౌస్‌లు ఏర్పాటు చేయాలని, ఖర్జూర పంట సాగును ప్రోత్సహించాలని వీఎన్ పల్లె ఎంపీపీ కోరారు. మామిడి రైతులకు పాస్ఫేట్ సబ్సిడీ కింద సరఫరా చేయాలని చక్రాయపేట జెడ్పీటీసీ కోరారు. జిల్లా ఉద్యాన అధికారి బదులిస్తూ ఖర్జూర సాగుకు అనుకూల పరిస్థితులు లేవన్నారు. ప్యాక్‌హౌస్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

బోగస్ సర్టిఫికెట్ల జారీపై కేసులు – ఎమ్మెల్యే 'పుట్టా'

సదరమ్ క్యాంపుల్లో అనర్హులకు కూడా అర్హులుగా వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. ముఖ్యంగా చెవుడు పేరిట వికలాంగ సర్టిఫికెట్లు సంపాదించి పెన్షన్లు పొందుతున్నారని తెలిపారు. బోగస్ సర్టిఫికెట్లు జారీచేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. పెన్షన్ కోసం డూప్లికేట్ ఆధార్ కార్డులు జారీ చేస్తూ ఒక్కో దానికి రూ. 6 వేలు చొప్పున లంచాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రహదారి సక్రమంగా లేకపోయినా టోల్ వసూలు చేయడం తగదన్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం రాజోలి ఆనకట్ట నిర్మాణాన్ని తమ ప్రభుత్వం చేపట్టనుందని తెలిపారు. దీని నిర్మాణ పనులు ఆళ్లగడ్డలోని తెలుగుగంగ ఇంజినీరింగ్ పరిధిలో ఉన్నాయన్నారు. ఆనకట్ట నిర్మాణాన్ని కడప సీఈ పరిధిలోకి తీసుకు రావాలని కోరారు.

తల్లికి వందనం ఇవ్వాలి –ఎమ్మెల్సీ



విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం ఇంతవరకు విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద డబ్బు ఇవ్వలేదని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఇందువల్ల విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. గతంలో తమ ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే జూన్‌లోనే రూ. 15000 విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసేదని పేర్కొన్నారు. ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా నేటికి అమలు చేయలేదన్నారు.

మార్గదర్శకాలేవీ? –సీకే దిన్నె జెడ్పీటీసీ



తల్లికి వందనం పథకం గురించి ఆర్భాటంగా హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు మార్గదర్శకాలు ఇవ్వలేదని సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. మధ్యాహ్న భోజన పథకం నాసిరకంగా ఉందని, గుడ్లు, చిక్కీలు ఇవ్వడం లేదన్నారు. ఖాజీపేటలో కలుషిత నీరు తాగడం వల్ల ఆస్పత్రుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2.30 లక్షల మంది వలంటీర్ల పరిస్థితి ఏమిటో చెప్పాలన్నారు. వలంటీర్లకు రూ. 10 వేలు జీతం ఇస్తామని చెప్పిన సీఎం ఇప్పుడు మౌన ముద్ర దాల్చడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలి – కలెక్టర్

జిల్లా అధికారులు కచ్చితంగా ప్రొటోకాల్ అమలు పాటించాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలను ఉంచాలన్నారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు లేవనెత్తిన సమస్యలను వచ్చే జెడ్పీ సమావేశానికి పరిష్కారాలు చూపాలన్నారు. ఎమ్మెల్యేలు డాక్టర్ దాసరి సుధ, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, కడప, అన్నమయ్య జాయింట్ కలెక్టర్లు గణేష్‌కుమార్, ఫర్హాన్ అహ్మద్ ఖాన్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రొటోకాల్ అమలు చేయాలి: ఎమ్మెల్యే ఆకేపాటి



ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రొటోకాల్ అమలు చేయాలని రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కోరారు. టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి సుబ్రమణ్యం ఒంటిమిట్ట మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో తమ అనుచరులతో తిష్ట వేసి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఆయన ప్రజాప్రతినిధి కాకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇలాగే వ్యవహరిస్తే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని హెచ్చరించారు. ఈ దశలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి జోక్యం చేసుకుని గత ప్రభుత్వ హయాంలో ప్రొటోకాల్ పాటించకుండా తనను కించపరిచారని తెలిపారు. దీంతో ఆకేపాటి, ఎమ్మెల్సీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ తాను ఎన్నడూ అలా వ్యవహరించలేదని తెలిపారు. ప్రజాప్రతినిధులను గౌరవించకుండా ఇలాగే వ్యవహరిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు.

- రాజంపేటలో డయాలసిస్ సెంటర్ నిర్మాణం పూర్తయి తమ ప్రభుత్వ హయాంలోనే సేవలు కూడా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని తెలుసుకోవాలంటూ ఎమ్మెల్సీ ప్రశ్నకు ఆకేపాటి సమాధానమిచ్చారు. ఇసుక క్వారీలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఇసుక పాలసీ విధి విధానాలు వినియోగదారులకు అర్థం కాని రీతిలోఉన్నాయన్నారు. ఇసుక విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.
- సీజనల్ వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ కోరారు. విరేచనాలు, విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్యులు గ్రామాల్లోకి రావడం లేదన్నారు. బి.కోడూరు మండలంలో ప్రభుత్వ ఆస్పత్రికి క్వార్టర్స్ అదనంగా ఏర్పాటుచేస్తే స్టాఫ్ నర్సులు అక్కడే ఉండేందుకు అవకాశం ఉంటుందని జెడ్పీటీసీ దావీదు తెలిపారు.

కోల్డ్ స్టోరేజ్ ప్లాంటు అందుబాటులోకి తేవాలి: ఎంపీ



అరటి రైతుల కోసం తమ ప్రభుత్వ హయాంలో రూ. 23 కోట్లు ఖర్చు చేసి ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మించామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. యూజర్ ఏజెన్సీని ఎప్పుడు గుర్తిస్తారో తెలపాలని ప్రశ్నించారు. నిర్ణీత కాల వ్యవధిలో యూజర్ ఏజెన్సీని గుర్తించి అరటి రైతులకు మేలు చేయాలని కోరారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పథకాల్లో ఎలాంటి జాప్యం లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. చక్రాయపేట మండలంలో తమ ప్రభుత్వ హయాంలో కాలేటి వాగు నిర్మాణ పనులు 75 శాతం పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇందువల్ల 72 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందన్నారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇలా గళం విప్పారు

జెడ్పీటీసీలు రవికుమార్‌రెడ్డి, ముత్యాల ప్రసాద్, దావీదు, ఎంపీపీలు వీరనారాయణ రెడ్డి, చీర్ల సురేష్‌యాదవ్ తదితరులు మాట్లాడుతూ త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. జెడ్పీ గ్రాంటు ద్వారా జరిగే అభివృద్ధి పనులను జెడ్పీటీసీల ద్వారా నిర్వహించే అవకాశం కల్పించాలని కోరారు. పశువుల బీమాతోపాటు షెడ్లు మంజూరు చేయాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు భవన వసతి కల్పించాలన్నారు. మినీ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రేపు జాబ్‌మేళా



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, అల్‌డిక్సన్, ట్రి విజన్, కాంపోజిట్ టెక్నాలజీ కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 18–32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ. 12–35 వేల వరకు హోదానుబట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవ పత్రాలు, ఫొటోలతో రావాలన్నారు.

ఆవుల కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్న మంత్రి

మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆవుల కుటుంబం తమకు పోటీగా నిలుస్తారనే భయంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వారిని లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగలక్ష్మితో పాటు వారి కుటుంబానికి మంచి పేరు ఉండడంతో ఆ కుటుంబాన్ని అణగదొక్కాలని మంత్రి ప్రయత్నిస్తున్నారన్నారు. ఆవుల కుటుంబం పూర్వం నుంచి దాన ధర్మాలు చేస్తున్న కుటుంబమే కాని ఇతరుల భూములను లేదా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొన్న చరిత్రలేదన్నారు. దేవపట్ల గ్రామంలో ఆసుపత్రి స్థలం, ఆసుపత్రి వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాల, బడుగు బలహీన వర్గాలకు ఇంటి పట్టాలు, పంచాయతీ కార్యాలయం, ప్రస్తుత సచివాలయ స్థలం కూడా ఆవుల కుటుంబం దానంగా ఇచ్చినవేనని గుర్తు చేశారు. ప్రస్తుతం వీటి విలువ కొన్ని కోట్ల రూపాయలు చేస్తుందన్నారు. ఇవన్నీ తెలిసి కూడా ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా ప్రైవేటు భూముల్లోకి స్వయంగా మంత్రి హోదాలో క్షేత్రస్థాయి పర్యటన చేసి భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు.

మండలాల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ శ్రీధర్



సబ్‌కలెక్టరేట్‌లో వివిధ మండలాల తహసీల్దార్లతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాజంపేట: మండలాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా మంగళవారం రాజంపేట ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓతోపాటు రాజంపేట డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్ఏ పరిధి దాటిన సమస్యలు, సీసీఆర్‌సీ కార్డులు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. త్వరగా వాటిని పరిష్కరించాలన్నారు. వారంవారం మండల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించుకోవాలన్నారు. తద్వారా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకునేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో ఆర్డీఓ మోహనరావు, రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

రాజంపేట పట్టణంలోని అరుంధతీవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహణ తదితర అంశాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ లోపంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ లోపానికి సంబంధించి సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. త్వరలో అంగన్‌వాడీ కేంద్రానికి మళ్లీ వస్తానన్నారు. పూర్తిస్థాయిలో సెంటర్ నిర్వహణ కొనసాగాలని ఆదేశించారు.


సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం..(ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

పేరుకే ఉచితం.. అంతా బూటకం

- లోడింగ్, రవాణా చార్జీల పేరుతో వినియోగదారులపై భారం
- స్టాక్ పాయింట్‌లోని ఇసుకనే విక్రయిస్తున్న వైనం
- టీడీపీ నేతల పక్కా వ్యూహంతో దోపిడీ
- కృత్రిమ కొరత సృష్టించేందుకు సిద్ధమవుతున్న నాయకులు



కమలాపురం స్టాక్ యార్డులో ఇసుకను లోడింగ్ చేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: అలవిగాని హామీలతో అందలమెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తాము చెప్పిన అబద్ధాలపై ఇసుక కోటలు కడుతోంది. ఇసుక ఉచితమని ఊదరగొట్టిన ప్రభుత్వం ఇప్పుడేమో వసూళ్లకు తెర లేపేందుకు సిద్ధమవుతోంది. రవాణా, లోడింగ్ చార్జీల పేరుతో వినియోగదారులపై భారం మోపుతోంది. తమకు కప్పం కట్టాల్సిందేనంటూ తెగేసి చెప్పేసింది. సామాన్యుడి నడ్డి విరిచేలా ఇసుక ధరతోపాటు లోడింగ్ చార్జీలు, ట్రావెలింగ్ చార్జీలు అదనమంటూ తేల్చేసింది. మరోవైపు లోడింగ్, రవాణా చార్జీల పేరుతో వ్యవస్థలన్నీ తన గుప్పిట్లో పెట్టుకునేలా టీడీపీ నేతలు స్కెచ్ వేస్తున్నారు. ఇప్పటికే డిపోల్లో ఇసుకను దోచుకున్న టీడీపీ వర్గీయులు ఇక కృత్రిమ కొరతను సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు.

- రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎలాంటి లాభాపేక్ష లేదంటూనే ఇసుక వ్యాపారానికి ప్రణాళిక సిద్ధం చేసింది. రీచ్‌ల నుంచి యార్డులకు తరలించడానికి అయ్యే నిర్వహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తామంటూ టన్ను ఇసుకను భారీ ధరకు విక్రయిస్తున్నట్లుగా ప్రకటించింది. నిన్నటివరకు ఇసుక విధానంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించి తాజాగా కూటమి ప్రభుత్వం చివరికి అదే పాలసీని అమలు చేస్తూ ధరను పెంచేలా భారం మోపుతోంది. మొత్తానికి కూటమి ప్రభుత్వం ప్రజల కళ్లల్లో ఇసుక కొట్టింది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతూ ఇసుక పాలసీని తెచ్చింది. మైనింగ్ శాఖ పర్యవేక్షణలో రీచ్‌ల్లో ఇసుకను తవ్వి యార్డుల్లో నిల్వ చేసింది. అక్కడి నుంచి వినియోగదారులు టన్నుల వంతున కొనుగోలు చేసే విధంగా విధి విధానాలను ప్రకటించింది. ఇసుక పాలసీ తెచ్చి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. ఇసుక విక్రయం ద్వారా వచ్చే ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు జమ చేసింది. అయితే అప్పటి ప్రతిపక్ష టీడీపీ ఇసుక విక్రయాలపై దుష్ప్రచారం చేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామంటూ గొప్పలు చెప్పింది. అయితే వాస్తవానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉచిత ఇసుక పేరు తో రీచ్‌లను దోచుకున్నారు. ఆ ఐదేళ్లలో ఏరోజూ ప్రజలకు ఉచితంగా ఇచ్చిన పాపాన పోలేదు. ఇసుక రీచ్‌ల్లో టీడీపీ నేతలు మోహరించి ట్రాక్టర్‌కు ఇంత, లారీకింత దోపిడీ చేశా రు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నదు ల్లో ఇసుకను బావులు బావులుగా తవ్వి సామాన్య కార్యకర్త నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కోట్లు కొల్లగొట్టారు. తాజాగా మరోసారి టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తామంటూ ప్రగల్భాలు పలికి ధరను నిర్ణయించి మరోసారి ప్రజలను మోసం చేస్తోంది.

- అన్నమయ్య జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లతోపాటు ఆరుచోట్ల స్టాక్ పాయింట్లు ఉండేవి. ప్రస్తుతానికి రీచ్‌ల నుంచి ఇసుక బయటికి తీయడం లేదు. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక కూడా ఎన్నికల సమయంలోనే వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్న ఇసుకను తరలించారు. దీంతో ఎక్కడా స్టాక్ పాయింట్లలో ప్రస్తుతానికి ఇసుక లేదు. ఇక సిద్దవటం మండల పరిధిలోని జ్యోతి వద్ద ఇసుక రీచ్‌లో ప్రస్తుతానికి ఇసుక రీచ్ ప్రారంభించారు. అయితే అక్కడ టన్ను రూ.340తో మొదలుకొని ట్రాక్టర్ ఇసుక రూ.1700కు విక్రయిస్తున్నారు. మూడు షిఫ్టులుగా తీసుకొని అవసరమైన లబ్ధిదారునికి ఆధార్‌కార్డు ఆధారంగా ఇసుక పర్మిట్ ఇస్తున్నారు. అయితే ప్రస్తుతానికి నగదు కడితే తప్ప ఇసుక పంపడం లేదు.

రీచ్‌లోనే లోడింగ్ చేసుకునే సౌకర్యం కల్పించాలి



సాండ్ స్టాక్ యార్డులో కాకుండా రీచ్‌లోనే సాండ్ లోడింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తే ఇటు ప్రభుత్వానికి, అటు వినియోగదారునికి చాలా ప్రయోజనం ఉంటుంది. గత ప్రభుత్వంలో టన్నుకు రూ.475 వసూలు చేసేవారు. ఇప్పుడు టన్నుకు రూ.341 వసూలు చేస్తున్నారు. అప్పుడు ఉచితం ఎలా అవుతుంది. –షేక్ సద్దాం హుసేన్, గువ్వల చెరువు, రామాపురం మండలం

క్లుప్తంగా

ఇద్దరు మోసగాళ్ల అరెస్ట్

మదనపల్లి : బ్యాంకు ఏటీఎం వద్ద నగదు డ్రా చేసుకునే వారిని ఏమార్చి చోరీలకు పాల్పడే ఇద్దరు మోసగాళ్లను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఓ కేసు విచారణలో భాగంగా నిఘా పెట్టిన పోలీసులకు మదనపల్లె సీటీఎం రోడ్డు ఎస్‌బీఐ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు తారసపడ్డారు. అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ విషయం వెలుగుచూసింది. విచారణలో తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లా మలైపట్టికి చెందిన శేఖర్ కుమారుడు ఎస్.యాదవన్(40), మిల్ కాలనీకి చెందిన జె.ప్రభు(44) ఏటీఎం, బ్యాంకుల వద్ద మోసాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయిందన్నారు. వారి నుంచి రూ.50వేల నగదు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ వెంకటసుబ్బయ్య, హెడ్‌కానిస్టేబుల్ శివ, కానిస్టేబుల్స్ ప్రసాద్, భద్రానాయక్‌లను డీఎస్పీ ప్రసాదరెడ్డి ప్రత్యేకంగా అభినందించారన్నారు.

పోయిన బంగారు నగల అప్పగింత



బాధితులకు బంగారు నగలను అందజేస్తున్న ఎస్ఐ

నందలూరు : ఓ వ్యక్తి పోగొట్టుకున్న బంగారు నగలను తిరిగి అప్పగించిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ వివరాల మేరకు.. ఆకేపాడు రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆవుల కిషోర్‌రెడ్డి, ఆవుల కవిత సోమవారం రాత్రి సిద్ధవటం నుంచి తమ స్వగ్రామానికి వెళ్తూ నందలూరు కృష్ణ స్వీట్స్ బేకరీ వద్ద ఆగారు. స్వీట్లు కొనుక్కొని తిరిగి ఆకేపాడుకు వెళ్లి చూసుకోగా వారి బంగారు నగల సంచి పోయిందని గుర్తించారు. బాధితులు వెంటనే బేకరీ వద్దకు వెళ్లి వెతకినా సంచి కనపడకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి బంగారు నగల బ్యాగు పోయిందని, అందులో నాలుగు గాజులు, లాంగ్ చైన్ మొత్తం 13 తులాల బంగారం ఉందని ఫిర్యాదు చేయడంతో సీసీ టీవీలో పోలీసులు పరిశీలించారు. కారులోనుంచి మహిళ దిగేటప్పుడు బ్యాగు పడిపోగా అక్కడ ఉన్న ఓ వ్యక్తి బ్యాగు తీసుకోవడం జరిగిందని గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని పిలిపించి సంచిని బాధితులకు అందజేశారు.

మైనర్ బాలుడిపై దాడి



గాయపడిన మైనర్ బాలుడు జాసర్

నందలూరు : మండలంలోని అరవపల్లికి చెందిన మైనర్ బాలుడు జాసర్‌పై వ్యక్తిగత కారణాలతో సోమవారం రాత్రి కొందరు కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడిని చికిత్స నిమిత్తం రాజంపేట ఆసుపత్రిలో చేర్పించారు. దాడి సంఘటనపై స్థానిక పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు.

వినియోగదారులకు షాక్

గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్‌పే యాప్‌ల ద్వారా కరెంటు బిల్లులు చెల్లించడం ఇకపై కుదరదు. విద్యుత్తు సంస్థ ప్రవేశ పెట్టిన ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా కానీ, సంస్థ వెబ్‌సైట్‌లోకి వెళ్లి కానీ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్బీఐ తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనతో వినియోగదారులకు షాక్ తగిలినట్లయింది. దీంతో కొన్ని చోట్ల తాజాగా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఎలాగైనా మొత్తం చెల్లించవచ్చుటూ అధికారులు బోర్డులు పెట్టాల్సి వచ్చింది.

- పేమెంట్ యాప్‌లతో నేరుగ విద్యుత్తు బిల్లుల చెల్లింపు కుదరదు
- ఈ నెల నుంచి ఏపీఎస్పీడీసీఎల్‌కు ఆర్బీఐ కొత్త నిబంధన
- ఇకపై విద్యుత్తు సంస్థ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారానే సేవలు
- తాజాగా క్యూఆర్ కోడ్‌తో చెల్లింపులకు అధికారుల వెసలుబాటు

మదనపల్లె సిటీ : గతంలో విద్యుత్తు బిల్లు చెల్లించేందుకు గంటల తరబడి వినియోగదారులు బారులు తీరి నిలబడాల్సి వచ్చేది. నిలబడలేని వారి విద్యుత్తు బిల్లు చెల్లింపులో జాప్యం జరిగి జరిమానా పడేది. ఈ దుస్థితికి స్వస్తి చెబుతూ మారిన సాంకేతికతను అందిపుచ్చుకొని పేమెంట్ యాప్‌లైన ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్‌పే తదితర యాప్‌ల ద్వారా విద్యుత్తు బిల్లు చెల్లించే వెసలుబాటు కలిగింది. మొదట్లో తక్కువగానే చెల్లింపులు జరిగినా అనంతరం అందరూ అలవాటుపడడంతో వసూళ్లు పుంజుకొన్నాయి.

75 శాతం ఆన్‌లైన్‌లో చెల్లింపులు

జిల్లాలో గృహ విద్యుత్తు, హెచ్‌టీ, పరిశ్రమల సర్వీసులకు సంబంధించిన బిల్లులు దాదాపు 75 శాతం వినియోగదారులు పేమెంట్ యాప్‌లతోనే చెల్లిస్తున్నారు. 25 శాతం బయట సిబ్బంది ద్వారా కానీ బ్యాంకుల ద్వారా కానీ కడుతున్నారు. అయితే ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుంచి ఆర్బీఐ కొత్త నిబంధనలు తీసుకువచ్చి వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ఇతర పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లింపులు నిలిపివేసింది. విద్యుత్తు బిల్లు చెల్లించాక ఆ డబ్బు సంస్థకు అందడంతో తీవ్ర జాప్యం జరగడమే ఇందుకు కారణమని చెప్పింది. ఎవరైనా సరే తమ బిల్లు చెల్లింపులు విద్యుత్తు శాఖ యాప్ ద్వారా గానీ, లేక వెబ్‌సైట్‌లో గానీ చెల్లిస్తే నేరుగా డబ్బు సంస్థకు చేరుతుందని చెప్పింది.

అవగాహన కరవై ఇబ్బందులు

వివిధ కారణాలతో ఆర్బీఐ తీసుకొచ్చిన నిబంధన కారణంగా చాలామంది వినియోగదారులు ఇబ్బందిపడ్డారు. కొత్తగా విద్యుత్తు శాఖ తీసుకొచ్చిన సౌకర్యంపై ప్రజలకు అవగాహన లేదు. దీంతో వినియోగదారులు అసహనం వ్యక్తంచేశారు. చెల్లింపులు ఆలస్యమవడంతో తాజాగా విద్యుత్తు అధికారులు కళ్లు తెరిచారు. కొన్ని ప్రాంతాల్లో ఒక క్యూ ఆర్ కోడ్ రూపొందించారు. వినియోగదారు స్వయంగా మొబైల్ నుంచి క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి 13 అంకెల సర్వీసు నెంబరును నమోదు చేయాలి. అనంతరం క్రెడిట్, డెబిట్, క్యాష్, కార్డులు, యూపీఐ, గూగుల్‌పే ద్వారా నేరుగా చెల్లించే వెసలుబాటు కల్పించింది. అయితే ఇది ప్రజలకు తెలియకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.



వినియోగదారుల అవగాహన కోసం విద్యుత్తు శాఖ ఏర్పాటుచేసిన బోర్డు

ప్రజలు సహకరించాలి



విద్యుత్తు శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు బిల్లులు చెల్లించాలి. జులై ఒకటి నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల ద్వారా విద్యుత్తు బిల్లులు చెల్లింపులు నిలిపివేశాం. వాటి నుంచి చెల్లించడం సాధ్యం కాకపోతే విద్యుత్తు శాఖ ఏర్పాటు చేసిన క్యూ ఆర్‌కోడ్ స్కాన్‌చేసి బిల్లులు చెల్లించాలి. ప్రజలు ఈ విషయంలో సహకరించాలి.
– యుగంధర్, విద్యుత్తు శాఖ ఈఈ, మదనపల్లె

పాలిసెట్ చివరి దశ నోటిఫికేషన్ విడుదల

మైదుకూరు: పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు చివరి దశ నోటిఫికేషన్ విడుదలైందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించేందుకు జూలై 11 నుంచి 13వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అనంతరం సర్టిఫికెట్ వెరిఫికేషన్, కళాశాల ఆప్షన్ల నమోదు ఉంటుందని.. జూలై 16న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. జూలై 18 నుంచి 20వ తేదీ వరకు కేటాయించిన కళాశాలలో చేరాల్సి ఉంటుందని వివరించారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, మూడేళ్ల డిప్లొమో కోర్సు పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. డిప్లొమో తర్వాత బీటెక్ చేయుటకు ఈసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కూడా ఇస్తామన్నారు.

హుండీ ఆదాయం రూ. 4,30,781



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవకులు

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయ హుండీని ఒంటిమిట్ట ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. రూ. 4,30,781లు ఆదాయం వచ్చినట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులు దొరస్వామి నాయుడు, గంగులయ్య, దిలీప్ తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలోని గజ్జల సురేష్(35) మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొండసుంకేసుల గ్రామానికి చెందిన జి.సురేష్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బేల్దారి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఏడాది కిందట కుటుంబ సమస్యలతో పిల్లలు, భర్తను వదిలేసి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసైన సురేష్ అప్పులు చేశాడు. కట్టలేక తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మూల్యాంకన భత్యం చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : 2023–24లో జరిగిన పదో తరగతి పరీక్షల మూల్యాంకన విధులలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వెంటనే భత్యం చెల్లించాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జాబీర్ డిమాండ్ చేశారు. డీఈఓ శివప్రకాష్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ రెమ్యునరేషన్ చెల్లింపు అంశంలో జరుగుతున్న జాప్యంపై ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. పది రోజుల్లో చెల్లించని పక్షంలో డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

మృతుడి కుటుంబీకులకు ఎమ్మెల్యే ఆకేపాటి పరామర్శ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : విద్యుత్తు షాక్‌తో రైతు పాటూరి చిన్నపరెడ్డి(52) మంగళవారం మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని సీతారామపురం గ్రామంలో ఉంటున్న పాటూరి చిన్నపరెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె రేణుక స్థానిక ఏఐటీఎస్‌లో ఇంజినీరింగ్, కుమారుడు యోగనరసింహారెడ్డి ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. వీరి కోసం చిన్నపరెడ్డి రాజంపేటలో ఉంటూ సీతారామపురంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. మంగళవారం రాజంపేట నుంచి సీతారామపురంలోని పొలంలో పనిచేసే కూలీలకు టిఫిన్‌ను బైక్‌పై తీసుకెళ్తున్నారు. పొలం సమీపంలో 11కేవీ విద్యుత్ తీగ తెగి రహదారికి అడ్డంగా ఊగుతోంది. ఇది గమనించని చిన్నపరెడ్డి దాటేందుకు ప్రయత్నించడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మృతుడు చిన్నపరెడ్డి బావమరిది రెడ్డెయ్యరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎస్ రామాంజనేయులు తెలియజేశారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న బంధువులు అధిక సంఖ్యలో ఏరియా ఆసుపత్రి వద్దకు చేరుకొని విలపించారు.

మృతుడికి ఆకేపాటి నివాళి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చిన్నపరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధైర్య పడవద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే విధంగా మన్నూరుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య ఇటీవల మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భార్య ఇంటికి రాలేదని భర్త ఆత్మహత్య



మంటల్లో కాలిపోయి మృతి చెందిన ఈశ్వరరెడ్డి

రాయచోటి టౌన్ : కట్టుకున్న భార్య కువైట్ నుంచి ఇంటికి రాలేదనే మానసిక వేదనతో ఈశ్వర్ రెడ్డి(35) పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయం సమీపంలో నివాసముండే ఈశ్వర్ రెడ్డి భార్య కొన్నేళ్ల కిందట జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లింది. ఆమె వెళ్లిన తరువాత ఇంటికి రాకపోవడంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో మనస్పర్థలు పెరిగాయి. అంతేగాక ఇంటిలో ఒంటరిగా ఉండడంతో మానసిక వేదనకు గురియ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు వారించడంతో ఆగిపోయాడు. అనంతరం మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. అరుపులు విన్న స్థానికులు పోలీసులకు, ఫైర్ స్టేషన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి, సిబ్బంది వచ్చి ఇంటి తలుపులు పగలకొట్టి మంటలార్పే సమయానికి పూర్తిగా కాలిపోయి మృతి చెందాడు. దీంతో ఇంటిలో మంటలార్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విచారణ చేపడుతున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

మేకలను తప్పించబోయి రైలు కింద పడి కాపరి మృతి



మృతి చెందిన మామిడి రామసుబ్బారెడ్డి



మృతి చెందిన రెండు మేకలు

సిద్దవటం : మేకలను తప్పించబోయి ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మేకల కాపరి మామిడి రామసుబ్బారెడ్డి(67) మంగళవారం మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దవటం మండలం మాధవరం–1 పంచాయతీ పరిధిలోని బెడుసుపల్లె కాలనీకి చెందిన మామిడి రామసుబ్బారెడ్డి జీవనోపాధి నిమిత్తం మేకలను పెంచుతున్నారు. నిత్యం రైల్వే ట్రాక్ అవల వైపునకు మేకలను మేపేందుకు తీసుకెళ్లేవాడు. మంగళవారం ఉదయం యథాప్రకారం వాటిని తీసుకెళ్లేటపుడు రైలు వస్తుండడంతో కొన్ని మేకలను ట్రాక్‌పై నుంచి తప్పించేందుకు పరుగు తీశాడు. అయితే అదుపు తప్పి కింద పడడంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్‌పై ఉండిపోయిన రెండు మేకలు మృత్యువాతపడ్డాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న కడప రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మామిడి రామసుబ్బారెడ్డి మృత దేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

ముగ్గురు విద్యార్థులకు గాయాలు





తీవ్రంగా గాయపడిన విద్యార్థులు

మదనపల్లె : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురు విద్యార్థులు గాయపడిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బి.కొత్తకోట మండలం గట్టుకు చెందిన అశోక్(18), పెద్దమండ్యం మండలం కంటేవారిపల్లెకు చెందిన అంజి(19), సోమల మండలం కందూరుకు చెందిన ప్రదీప్(20) నీరుగట్టువారిపల్లె హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్నారు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంలో నీరుగట్టువారిపల్లెకు వస్తుండగా, చంద్రాకాలనీ వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పేడదిబ్బలపై వాహనాన్ని ఎక్కించి కిందపడ్డారు. ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

వ్యక్తిపై దాడి – నలుగురిపై కేసు

కడప అర్బన్ : కడప నగర రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆరోగ్యమాల చర్చి సమీపంలో బయనపల్లి సుబ్బరామయ్యపై ఈ నెల 8న రాత్రి దస్తగిరమ్మ, మరో ముగ్గురు దాడి చేశారు. డబ్బుల బాకీ వ్యవహారంలో ఘర్షణ ఈ దాడికి దారి తీసింది. గాయపడిన సుబ్బరామయ్య కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

దుకాణంలో దౌర్జన్యం

కడప అర్బన్ : కడప నగరంలోని చెన్నూరు బస్టాండ్ సమీపంలో వున్న ఓ దుకాణంపై ఈ నెల 7వ తేదీన దాడి చేసి పెండ్లిమర్రి మండలం చీమలపెంటకు చెందిన చంద్రశేఖర్, మరికొంతమంది ప్రింటర్ తీసుకెళ్లారు. ఈ సంఘటనలో బాధితుడు ప్రవీణ్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే స్టేషన్ సమీపంలోని యార్డు వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి భాస్కర్ అనే వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సుభాన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కడప నగరం ఎర్రముక్కపల్లె గాంధీ నగర్‌కు చెందిన భాస్కర్ ఆటో డ్రైవర్‌గా పనిచేసే వాడన్నారు. కుమార్తె వివాహానికి చేసిన అప్పు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

అనుమానంతోనే.. గొంతుకోసి హత్య

- వీడిన నిమ్మనపల్లె మహిళ హత్య కేసు మిస్టరీ
- భార్యను కిరాతకంగా చంపిన భర్త అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసాదరెడ్డి



భారతి(ఫైల్)



గణపతి (ఫైల్)



గణపతి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి, తదితరులు

మదనపల్లె : మగవారితో చనువుగా మాట్లాడుతోందని.. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భార్య గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె వ్యవసాయ పొలాల్లో జూన్ 27న జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను డీఎస్పీ ప్రసాదరెడ్డి మంగళవారం వెల్లడించారు.

చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణం నాగరాళ్లవీధికి చెందిన పి.మునిరత్నం కుమారుడు పి.గణపతి(37) అలియాస్ వెంకటేష్‌కు అదే జిల్లా పెనుమూరు మండలం కార్తికేయపురానికి చెందిన వెంకటయ్య, సాలమ్మల కుమార్తె భారతి(26)ని ఇచ్చి తొమ్మిదేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారుల సంతానం. గణపతి ఇటీవల మద్యం తాగుతూ జులాయిగా మారాడు. అతడి భార్య భారతి పలమనేరు బస్టాండులో పూలమ్ముతూ జీవనం సాగిస్తోంది. అయితే పూలు అమ్మేటప్పుడు మగవారితో చనువుగా మాట్లాడుతుండడంతో గణపతి ఆమెపై అనుమానం పెంచుకుని వేధించాడు. విసిగి వేసారిన భారతి ఏడాదిన్నర కిందట పిల్లలను భర్త వద్దే వదలి నెల్లూరు జిల్లా కోవూరులో ఉంటున్న తల్లి సాలమ్మ వద్దకు వెళ్లింది. భర్త పిలిచినప్పుడల్లా పలమనేరుకు వచ్చి పిల్లలను చూసి వెళ్తుండేది.

వివాహేతర సంబంధమందనే అనుమానంతో..

ఇటీవల కొవ్వూరులో భారతి స్థానికుడు రవితో సన్నిహితంగా ఉందని గణపతికి తెలియడంతో అనుమానం పెంచుకున్నాడు. ఆమెను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. పిల్లలను నీ వద్దకు పంపుతా.. తీసుకెళ్లాలంటూ చెప్పి జూన్ 27న భార్యను రప్పించాడు. నెల్లూరు నుంచి రైలులో వచ్చిన భారతి చౌడేపల్లెకు వచ్చి భర్తను కలుసుకుంది. మదనపల్లెలో తెలిసిన వారి వద్ద పిల్లలున్నారని చెప్పి ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె సమీపంలోని వ్యవసాయ పొలంలో పశువుల పాక వద్దకు తీసుకెళ్లారు. వివాహేతర సంబంధంపై నిలదీయడంతో భార్యా, భర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన గణపతి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోసి చంపేశాడు. ఆ సమయానికి పొలానికి నీళ్లు పెట్టేందుకు వచ్చిన రామాంజనేయులుపైనా కత్తితో దాడి చేశాడు. అతడు కేకలు వేయడంతో గణపతి ద్విచక్ర వాహనంలో పారిపోయాడు. మృతురాలి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, నిందితుడైన గణపతిని బైపాస్ రోడ్డులోని నిమ్మనపల్లె సర్కిల్ వద్ద అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి, పీసీలు రాజేష్, శివ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ–నీవాపై నేడు ఉన్నతస్థాయి సమీక్ష

- రూ.250 కోట్లు కావాలని అధికారుల నివేదిక
- పుగత ప్రభుత్వం రూ.1,217 కోట్లతో చేపట్టిన పుంగనూరు ఉపకాలువ విస్తరణపై నిర్ణయం?

బి.కొత్తకోట: రాయలసీమ రైతుల కల్పతరువు ఏవీఆర్ హంద్రీ–నీవా సాగు, తాగునీటి ప్రాజెక్టు రెండో దశపై విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ప్రాజెక్టు ఉన్నతాధికారులు నివేదికలతో సమీక్షకు హాజరయ్యేందుకు సమాయత్తమయ్యారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మలరామానాయుడు చాంబర్‌లో నిర్వహిస్తున్న ఈ సమీక్షకు కర్నూలు, అనంతపురం, అన్నమయ్య జిల్లా మదనపల్లె సూపరింటెండెంట్ ఇంజినీర్లు, చీఫ్ ఇంజినీర్లు, ప్రాజెక్టు పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు హాజరుకానున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు స్థితిగతులు, అసంపూర్తి పనులు, ఈ ప్రాజెక్టుతో అనుసంధానించిన కొత్త ప్రాజెక్టుల పనులు, వాటి పురోగతి, సమస్యలపై మంత్రి సమీక్షించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోకి వచ్చే ప్రాజెక్టు పనులకు సంబంధించి సమగ్ర నివేదికను ఆయనకు అందించనున్నారు. జిల్లాలో సాగే ప్రాజెక్టు ప్రధాన కాలువ, ఇతర కాలువలు, డిస్ట్రిబ్యూటరీల పెండింగ్ పనులను నివేదిస్తూ వాటి పూర్తికి అవసరమైన నిధులను కోరేందుకు నివేదిక సిద్ధం చేశారు. అందులో పెద్దమండ్యం మండలం మీదుగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన గాలివీడు సమీపంలోని శ్రీనివాసపురం రిజర్వాయర్ వరకు సాగే ప్రధాన కాలువ పనికి రూ.42.34 కోట్లు, నీవా బ్రాంచ్ కెనాల్‌కు రూ.72.55 కోట్లు, వాయల్పాడు బ్రాంచ్ కెనాల్‌కు రూ.10.18 కోట్లు, తంబళ్లపల్లె బ్రాంచ్ కెనాల్‌కు 29.06 కోట్లు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు రూ.35.23 కోట్లు, చింతపర్తి డిస్ట్రిబ్యూటరీకి రూ.11 కోట్లు, ఎల్లుట్ల డిస్ట్రిబ్యూటరీకి రూ.21.75 కోట్లు, సదుం డిస్ట్రిబ్యూటరీకి రూ.9.06 కోట్లు, గుడిసెబండ డిస్ట్రిబ్యూటరీకి రూ.18.27 కోట్లతో మొత్తం రూ.250 కోట్లు మంజూరు చేస్తే పనులన్నీ పూర్తి చేస్తామని నివేదిక అందించనున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లా పెద్దతిసముద్రం మండలం నుంచి పెద్దపంజాణి మండలం వరకు సాగే పుంగనూరు ఉప కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కుల నుంచి 1,180 క్యూసెక్కుల సామర్థ్యాన్ని పెంచేలా కాలువ విస్తరణ పనులు చేపట్టింది. ఈ పనికి టెండర్లు నిర్వహించగా కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థతో పనులు పూర్తి చేయించేందుకు రూ.1,217.49 కోట్లతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు కాంట్రాక్టు సంస్థ పనులు గత ప్రభుత్వంలోనే మొదలు పెట్టింది. అయితే పనులను ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక మరేదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్నది మంత్రి సమీక్షలో తేలనుంది. ప్రస్తుతం అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు ఈ పని ఎంతో ప్రయోజనకరమైంది. గండికోట నుంచి 12 టీఎంసీల కృష్ణా జలాల తరలింపు ఈ కాలువ విస్తరణ పనులపై ఆధారపడి ఉంది.